

నంది వాహన సేవ

స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం



కల్యాణ వైభోగం

నంద్యాల (ఆంధ్ర జ్యోతి)

మార్చి 8: కమనీయం.. నేత్రానందం.. శ్రీశైల మల్లికార్జునుడు, భ్రమరాంబ అమ్మవార్ల కల్యాణం. ఆది దంపతుల వివాహ మహోత్సవాన్ని వీక్షించి భక్తులు ఆనందంతో పులకించిపోయారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఇల కైలాసం శ్రీగిరిలో స్వామి అమ్మవార్ల కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు శ్రీశైలానికి చేరుకున్నారు. భక్తుల శివన్నామ స్మరణ, శివ భజనలతో నల్లమల అటవీ ప్రాంతం మార్మోగింది. రాత్రి 10 గంటలకు ఆలయ ప్రధాన పూజారులు లింగోద్భవకాల మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. మల్లన్న పాగాలంకరణ కార్యక్రమాన్ని పృథ్వీ వెంకటేశ్వర్లు తనయుడు సుబ్బారావు చేపట్టారు. రుద్రాభిషేకం ముగిసిన అనంతరం అర్ధరాత్రి మల్లన్న భ్రమరాంబికా దేవి కల్యాణం నేత్రానందంగా సాగింది. అంతకుముందు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ప్రభోత్సవం, నంది వాహన సేవ ఘనంగా సాగింది.




శ్రీశైలంలో భక్తుల రద్దీ

● కల్యాణోత్సవం..

శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం కన్నులపండుగగా జరిగింది. ముందుగా కల్యాణానికి కంకణాలను, స్వామి అమ్మవార్ల ఆభరణాలను, యజ్ఞోపవీతాన్ని భాషికాలను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణోత్సవంలో స్వామివారు పట్టు వస్త్రాలను ధరించి, తలపై ఒక వైపు గంగమ్మను, మరోవైపు నెల వంకను, మెడలో రుద్రాక్ష మాలను, నుదుట విభూది రేఖలతో పెండ్లి కుమారునిగా ముస్తాబయ్యారు. భ్రమరాంబ దేవి పట్టు వస్త్రాలను ధరించి, నుదుట కల్యాణ తిలకాన్ని, బుగ్గన చుక్కను, సూర్యాభరణాలను ధరించి పెళ్లి కూతురుగా దర్శనమిచ్చింది. స్వామి అమ్మవారు అర్ధరాత్రి 12 గంటలకు వెండి పల్లకిలో పెండ్లి మండపానికి చేరుకున్నారు. నుదుట భాషికం కట్టి, తిలకం దిద్ది, కస్తూరి జవ్వాజీ సుగంధ పరిమళాలతో పెండ్లి పీటలపై ఆశీనులయ్యారు. స్వామి అమ్మవార్ల కల్యాణ సంబరం అంబరాన్ని తాకింది. ఆదిదేవుడి కల్యాణానికి యథావిధిగా రాష్ట్ర ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం, కాణిపాకం దేవస్థానం సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు జరిగిన వివాహ వేడుకను తిలకించిన భక్తులు పరవశించి పోయారు. కల్యాణోత్సవంలో అమ్మవారి ఆలయ అర్చకులు, వేదపండితులు భ్రమ రాంబదేవి అమ్మవారి తరఫున బంధువులు, స్వామివారి అర్చక, వేదపండిత గణం మల్లికార్జున స్వామివారి బంధు వర్గంగా వ్యవహరించారు. మంగళవాయిద్యాలతో, వేదమంత్రాల నడుమ నేత్రానందంగా జరిగిన స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించి భక్తులు పులకించి పోయారు. సాయంత్రం క్షేత్ర ప్రధాన వీధుల్లో అశేష భక్తజనం నడుమ స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించారు.

సంధ్యా సమయాన అశేష భక్త జనం నడుమ కొనసాగుతున్న స్వామి, అమ్మవార్ల ప్రభోత్సవం



శ్రీశైల మల్లన్న ఆలయానికి పాగాలంకరణ

● ఆకట్టుకున్న పాగాలంకరణ..

లింగోద్భవకాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీశైల మల్లన్నకు మాత్రమే పరిమితమైన ఈ పాగాలంకరణకు ఎంతో విశిష్టత ఉంది. వివాహ సమయంలో పెండ్లి కుమారునికి తలపాగ చుట్టడం సంప్రదాయం. అదేవిధంగా శ్రీశైలం మల్లికార్జునుడు పెళ్లి కుమారుడిగా ముస్తాబవుతున్న తరుణంలో ఆయనకు పాగాలంకరణ చేపడతారు. ఆరు దశాబ్దాల క్రితం మొదలైన ఈ కార్యక్రమం ప్రస్తుతం ఆనవాయితీగా వస్తోంది. ఈ పాగాలంకరణ కార్యక్రమంలో భాగంగా 365 మూరల పాగాను గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖ మండపం పైన ఉన్న నందులకు అనుసంధానిస్తూ తలపాగాను తలపించేలా ముస్తాబు చేస్తారు. అత్యంత నియమ నిష్ఠలతో బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు కుటుంబం సంవత్సరంపాటు నేసిన పాగాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు నేసిన వస్త్రాలను పాగాలంకరణకు వినియోగించారు.

లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాత్రి 10 గంటల నుంచి స్వామివారికి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిపించారు. నిష్ణాతులైన 11 మంది అర్చకులు, వేదపండితులు మహన్యాసపూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా జ్యోతిర్లింగ స్వరూపుడైన స్వామివారికి అభిషేకం జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికా గుండంలోని జలాలు, పంచామృతాలు, పలు ఫలోదకాలతోనూ ఈ అభిషేకం నిర్వహించారు.

● నంది వాహనంపై ఊరేగిన మల్లన్న

భ్రమరాంబ సమేతుడై మల్లికార్జునుడు నంది వాహనంపై ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో 8వ రోజు స్వామివారికి నంది వాహన సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఈ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజాది హారతులు ఇచ్చారు. అనంతరం ఆలయంలో నంది వాహనంపై కొలువైన ఆది దంపతులను ఆలయ ప్రదిక్షణ ద్వారా ఊరేగించారు. ఈ ఊరేగింపులో వివిధ జానపద కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.



యాగంటి గుహలో భక్తులు

శేష వాహనంపై మహానందీశ్వరుడు



మహానందిలో స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం


టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ

మహానంది, మార్చి 8: మహానంది క్షేత్రంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవ వైభవం కొనసాగుతోంది. శుక్రవారం ఆలయంలో యథావిధిగా రుత్వికులు, ఆలయ వేదపండితులు పూజలు నిర్వహించారు. నందీశ్వరునికి వేదమంత్రాలతో పూజలు జరిపారు. రెండో ప్రాకారంలోని పూల కోనేర్లలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి పరమశివుడిని వేకువ జాముననే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం శేష వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు గావించారు. ఆలయం పురవీధుల గుండా కన్నుల పండువగా గ్రామోత్సవం జరిపారు. రాత్రి 8 గంటల నుండి నంది వాహన సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జాగరణ పురస్కరించుకొని వేలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తిమ్మాపురం పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, జిందాల్ సంస్థ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు: మహానందిలో శనివారం తెల్లవారు జామున జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శుక్రవారం పట్టు వస్త్రాలు అధికారులు తెచ్చారు. కర్నూలు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డి, భూపాల్‌రెడ్డిలు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు జరిపారు.



మహానందిలో..



యాగంటి కోనేరులో పుణ్య స్నానాలు



మహానందిలో భక్తజన సందోహం

యాగంటిలో ఓంకార నాదం

బనగానపల్లె, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఎర్రమల్ల కొండల్లో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి క్షేత్రం శుక్రవారం ఓంకారం, శివనామస్మరణతో మార్మోగింది. ఉమా మహేశ్వర స్వామివార్ల దర్శనార్థం వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఉదయం 5 గంటలకు స్వామివార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో యాగంటి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు ఆలయ పాలకవర్గం అందజేసింది. భక్తులు పెద్ద కోనేరులో స్నానమాచరించి యాగంటి బసవేశ్వరుడ్ని దర్శించుకొని, ఉమామహేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర పాలకుడు వీరభద్రస్వామిని దర్శించుకున్న భక్తులు వెంకటేశ్వర గుహ, శంకర గుహలను సందర్శించారు. రాత్రి లింగోద్భవ కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి జాగరణ సందర్భంగా రేలారేలా కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బనగానపల్లె ఆర్టీసీ ఆధ్వర్యంలో యాగంటి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దొంగల ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

- టీడీపీని గెలించి చంద్రబాబును సీఎం చేద్దాం
- నారా భువనేశ్వరి పిలుపు

రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు



రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భువనేశ్వరి పూజలు

పత్తికొండ, మార్చి 8 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నారా భువనేశ్వరి శుక్రవారం పత్తికొండ మండలం మండిగిరి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. నిజం గెలవాలి పర్యటనలో భాగంగా గురువారం పత్తికొండలో ఆమె రాత్రి బస చేశారు. శుక్రవారం మహా శివరాత్రి మండగిరి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో నారా భువనేశ్వరికి ఆలయంలోకి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం శాలువాతో సత్కరించారు. టీడీపీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్సీ అనురాధ కూడా రామలింగేశ్వరస్వామికి ప్రత్యే కపూజలు చేశారు.



రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కేఈ శ్యాంబాబు పూజలు





పెంచికలపాడులో బాధిత కుటుంబాలను ఓదార్చి ఆర్థిక సహాయం అందజేస్తున్న నారా భువనేశ్వరి

గూడూరు, మార్చి 8: రాష్ట్రంలో నియంతృత్వం చెలాయిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా శుక్రవారం గూడూరు నగర పంచాయతీతోపాటు మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామంలో పర్యటించారు. చంద్రబాబు నాయుడును అరెస్టుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ముందుగా గూడూరులోని పడమర బీసీ కాలనీలో బోయ గౌరన్న ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అదే కాలనీలోని షేక్షావలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పెంచికలపాడు గ్రామానికి చేరుకున్నారు. టీడీపీ కార్యకర్త మహబూబ్ బాషా ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మహబూబ్ బాషా కుమారుడు షేక్షావలిని ఎన్టీఆర్ ట్రస్టు నుంచి ఉచితంగా చదివిస్తానని భువనేశ్వరి హామీ ఇచ్చారు. అంతకు ముందు బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం అక్కడికి తరలివిచ్చన మహిళలు, ప్రజలను ఉద్దేశించి నారా భువనేశ్వరి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు, జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకులు రామాంజనేయులు, గజేంద్ర గోపాల్, సుందరరాజు, జె.సురేష్, రేమట వెంటటేష్, కుర్వ హనుమంతు, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, కె.కృష్ణ, గోపాల్ రెడ్డి, సృజన్, పౌలు, తెలుగు శ్రీను, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలంతా కుటుంబ సభ్యులే

- నారా భువనేశ్వరి



రాజేశ్వరమ్మను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

కోడుమూరు/కోడుమూరు (రూరల్), మార్చి 8: మండలంలోని ప్యాలకుర్తిలో టీడీపీ నాయకుడు నాగార్జున గౌడ్ కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసిన సమయంలో తట్టుకోలేక నాగార్జున గౌడ్ గుండెపోటుకు గురై మృతి చెందాడు. నిజం గెలవాలి నినాదంతో పర్యటిస్తున్న భువనేశ్వరి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. నాగార్జునగౌడ్ సతీమణి రాజేశ్వరికి ధైర్యం చెప్పి ఓదార్చారు. బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయలేదని ప్యాలకుర్తికి చెందిన పలువురు వికలాంగులు నారా భువనేశ్వరి ఎదుట వాపోయారు. సుమారు 35 మంది వికలాంగులకు గత టీడీపీ ప్రభుత్వంలో స్థలాలు కేటాయించారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారాక ఇంతవరకు ఇళ్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు అందడం లేదని, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు కాలేదని, విద్యుత్ చార్జీల భారంతో అగమ్యగోచరంగా మారిందని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ పాల్గొన్నారు.



ఓర్వకల్లు విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు విమానాశ్రయంలో వీడ్కోలు

ఓర్వకల్లు, మార్చి 8: మండలంలోని ఓర్వకల్లు విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలి పర్యటనలో భాగంగా పత్తికొండ, తుగ్గలి, క్రిష్ణగిరి, కోడుమూరు మండలాల్లో పర్యటన ముగించుకుని ప్రత్యేక వాహనంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు. భువనేశ్వరికి వీడ్కోలు పలికిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, టీడీపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, దస్తగిరి, తుగ్గలి నాగేంద్ర, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, ప్రభాకర్ యాదవ్, నాగముని, అల్లాబాబు, యేసేబు, తదితరులు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

పగిడ్యాల, మార్చి 8: మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్.హరినాథ్ రెడ్డి, కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, కుంకుమార్చన, గణపతి పూజ నిర్వహించారు. అర్చకుడు సోమయ్య తీర్థప్రసాదాలు పంచారు.



ప్రాతకోట నాగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

- రూ. 30 లక్షల మేర ఆస్తి నష్టం

మంత్రాలయం, మార్చి 8: మంత్రాలయంలోని రాఘవేంద్రపురం బిచ్చాల మఠంలో అర్చకుడిగా పని చేస్తున్న వైభవస్వామి ఇంట్లో విద్యుదాఘాతంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. శుక్రవారం ఉదయం వైభవస్వామి, ఆయన కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బీజాపూర్‌కు వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో కరెంట్ హైటల్టేజీ వల్ల షార్ట్ సర్క్యూట్ అయి ఇంట్లో ఉన్న రూ.1.50 లక్షలు నగదు, ఆరు తులాల బంగారు, వెండి, ఫర్నీచర్, టీవీ, ఫ్యాన్లు, నీటి మోటార్లు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో నుంచి పొగలు వస్తుండటం గమనించిన కాలనీవాసులు ఇంటి తాళం పగులకొట్టి ఇంట్లోని వస్తువులను బయటకు తీశారు. ఎమ్మిగనూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అప్పటికే ఆ ఇంట్లో దాదాపు రూ.30 లక్షల దాకా నష్టం వాటిల్లింది. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తన సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాదాపు రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి టీటీడీ బోర్డు సభ్యులు సీతారామిరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, బాధితులను పరామర్శించి రూ.25వేలు తక్షణ ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చారు. ఇందులో కురువ మల్లికార్జున, గోరుకల్లు క్రిష్ణస్వామి, రవిస్వామి, వీకేసీ రాఘవేంద్రాచార్ ఉన్నారు

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోసిగి, మార్చి 8: కోసిగి మండల పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున కర్ణాటక రాష్ట్రం నుంచి కోసిగికి తరలిస్తున్న సుమారు రూ.60 వేల విలువ చేసే పది బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అడిషనల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన బోయ వీరారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన అక్రమ కర్ణాటక మద్యం అని ఆ వ్యక్తి పరారు కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అక్రమ కర్ణాటక మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ మహబూబ్ బాషా, సిబ్బంది నాగరాజు తదితరులు ఉన్నారు.

పాణ్యంలో వైసీపీకి షాక్

గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌరు దంపతులు

కల్లూరు, మార్చి 8: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. శుక్రవారం పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో ఓర్వకల్లు మండలం ఉప్పలపాడుకు చెందిన నవ్యాంధ్రప్రదేశ్ జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, వైసీపీ నాయకుడు రాజుతోపాటు 100 కుటుంబాలు టీడీపీలో చేరారు. గౌరు దంపతులు వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో సెంట్రింగ్‌రాజు, కిషోర్, అనిల్, అరున్, సురేష్, పవన్, నాగరాజు, మారెన్న, లక్ష్మన్న, వెంకటేశ్వర్లు, మాల అయ్యస్వామి ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలకొలను సుధాకర్‌రెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఉప్పలపాడు నాయకుడు సుబ్బారెడ్డి, మాజీ సర్పంచు రంస్వామి, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, న్యాయవాది నాగముని పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం : గౌరు చరిత

మహిళా సాధికారతే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్‌లు మరో కీలక ముందడుగు వేశారని, కలలకు రెక్కలు అనే పేరుతో కొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకువచ్చారని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం తన స్వగృహంలో ఆమె మాట్లాడుతూ ఏపీలో మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించి ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఇంటర్ పూర్తి చేసిన మహిళలు ఆర్థిక పరిస్థితుల కారణంగా వారిలోని కలలతో రాజీ పడకుండా లక్ష్యాలు చేరుకోవాలనే దిశగా ఈపథకం అడుగులు వేసిందన్నారు.

వైసీపీ ఇంటికే

- విధ్వంసం తప్ప.. చేసిన అభివృద్ధి ఏమీ లేదు
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో పర్యటిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 8: అరాచక పాలనతో రాష్ట్రాన్ని నాశనం చేసిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపించడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని 13, 19 వార్డులలో ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజలకు ఎంతో నష్టం కలిగించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. వైసీపీ నాయకుల దృష్టంతా అక్రమ సంపాదన మీదే తప్ప.. ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. ఐదేళ్లలో వైసీపీ చేసిన అభివృద్ధి, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు, నిత్యావసర ధరలు, గ్యాస్ ధరలు అన్ని పెంచి ప్రజల జేబులను గుల్ల చేయడమేనన్నారు. ఐదేళ్ల పాలనలో రైతాంగానికి ఏం మేలు చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మద్రి రమణ, చిట్యాల మద్దయ్యగౌడు, శ్రీనివాస భట్, భాస్కర్ నాయుడు, విజయకుమార్ రెడ్డి, ఆలేబాదు పరమేష్, తిమ్మయ్య యాదవ్, అన్వర్‌బాషా, ఎస్ఎండీ రఫి, చంద్రపల్లి ఆచారి, దిలీప్ రెడ్డి, ఎల్లగౌడు, తాడూరు వెంకటరమణయ్య, భూమా నాగన్న, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశీ మహేష్, పాల్గొన్నారు.

పతనావస్థలో ప్రజాస్వామ్యం

- రాష్ట్ర ఎన్నికల మాజీ అధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్



నంద్యాలలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 8 : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పతనావస్థలో ఉందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఎన్నికల మాజీ అధికారి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం - ఓటు వేద్దాం రాష్ట్ర స్థాయి కళాజాత శుక్రవారం నంద్యాలలోని రామకృష్ణా డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మన దేశ సంస్కృతికి, పౌర సమాజానికి ఆదర్శప్రాయమని, కానీ రాష్ట్రంలో అలాంటి వాతావరణం మచ్చుకు కూడా కనబడటం లేదని అన్నారు. రాష్ట్ర రాజకీయాలలో విష సంస్కృతి తయారైందని, రానున్న ఎన్నికలు రాష్ట్రంలో యుద్ధ వాతావరణంలో జరగనున్నాయని అన్నారు. గతంలో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో జరిగిన పరిణామాలు రాజ్యాంగ విరుద్ధంగా జరిగాయని, ఒకే నియోజకవర్గంలో 35 వేల దొంగ ఓట్లు ఉంటే రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. ఇంత జరిగినా ఎన్నికల కమిషన్ నిద్రావస్థలో ఉందని ఆయన తప్పుబట్టారు. ప్రజాస్వామ్యంలో వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేకున్నా ఓటర్ల వ్యక్తిగత విషయాలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన వివరించారు. ఎన్నికల విధుల్లో వలంటీర్ వ్యవస్థ సేవలను వినియోగించవద్దని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఎన్నికల అధికారి ఎందుకు స్పందించలేదని, కలెక్టర్లకు ఎందుకు ఆదేశించలేదని ఆయన అన్నారు. తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలో ఒకే అసెంబ్లీ స్థానంలో 35 వేల దొంగ ఓట్లు ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని లక్షల దొంగ ఓట్లు నమోదు చేసి ఉంటారో ఊహించవచ్చని అన్నారు. దీనిపై ఎన్నికల యంత్రాంగం నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. అనంతరం ప్రముఖ ప్రజా గాయకుడు మహమ్మద్ మియా ఓటర్లను చైతన్యపరిచే పాటలు పాడారు. కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరీ ఇంత బరి తెగింపా?

- గంగ 16వ బ్లాక్ చానెల్ ఉప కాల్వను పూడ్చివేసిన వైసీపీ నాయకుడు
- పెట్రోలు బంకు కోసం రైతులను దగా చేసిన వైనం



రుద్రవరం మండలం యల్లావత్తుల సమీపంలో 16వ గంగ బ్లాక్ చానెల్ ఉప కాల్వను పూడ్చిన దృశ్యం

రుద్రవరం, మార్చి 8 : రైతుల పంట భూములకు సాగునీరు అందించే తెలుగుగంగ 16వ బ్లాక్‌చానెల్‌లో భాగంగా ఉండే ఉప కాల్వను వైసీపీ నాయకుడు పూడ్చివేశారు. తనకు మంజూరైన పెట్రోలు బంకును నిర్మించుకోడానికి ఏకంగా గంగ ఉప కాల్వను పూడ్చేసేందుకు బరితెగించాడు. రుద్రవరం మండలం యల్లావత్తుల గ్రామ సమీపంలో గంగ ఉప కాల్వ నుంచి వచ్చే నీటి మీద ఆధారపడి రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. అక్కడ సదరు వైసీపీ నాయకుడికి ఓ కంపెనీ పెట్రోలు బంకు మంజూరైంది. రహదారికి, పెట్రోలు బంకు స్థలానికి మధ్యలో తెలుగుగంగ ఉప కాల్వ ఉంది. పెట్రోలు బంకుకు తెలుగుగంగ ఉప కాల్వ అడ్డం వస్తుందని దానిని పూర్తిగా చదును చేశారు. అడిగే వారు లేదని ఇష్టారాజ్యంగా పూడ్చివేశారు. తన స్వలాభం కోసం వందలాది మంది రైతులకు సాగునీరందే కాల్వలను కూడా వైసీపీ నాయకులు వదల్లేదు. ఇట్లా అయితే తెలుగుగంగ ఉప కాల్వ కింద ఉన్న భూములకు సాగునీరు అందేది ఎలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

గంగ ఉప కాల్వను పరిశీలించాం

రుద్రవరం మండలం యల్లావత్తుల సమీపంలో 16వ గంగ బ్లాక్ చానెల్‌లో భాగంగా ఉప కాల్వను పూడ్చివేసిన స్థలాన్ని పరిశీలించాం. ఎలాంటి అనుమతులు లేకుండా పూడ్చివేశారు. కనీసం ప్రత్యామ్నాయ కాల్వ కూడా ఏర్పాటు చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లాను.

- నాగరాజు, ఏఈ, తెలుగుగంగ

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కోసిగి, మార్చి 8: మండల పరిదిలోని పల్లెపాడు గ్రామానికి చెందిన ఎర్రనేల కోట హనుమంతు (46) అనే వ్యక్తి రాయచూరు సమీపంలో రైలు కింద పడి అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. వారం రోజుల క్రితం హనుమంతు మాలపల్లికి వెళ్లి, ఆ తర్వాత కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు మిస్సింగ్ అయినట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతునికి అనారోగ్య సమస్యలు, మతిస్థిమితంగా లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నది. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసి కోసిగి పోలీసులకు రెఫర్ చేశారు.

పత్తికొండ ఎమ్మెల్యేకు చేదు అనుభవం

వెల్దుర్తి, మార్చి 8: పట్టణ సమీపంలో ఉన్న బ్రహ్మగుండంలో మహాశివరాత్రి రద్దీ నేపథ్యంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రజా నిరసన చవిచూడాల్సి వచ్చింది. పత్తికొండ ఎమ్మెల్యే శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులతో కలసి కామేశ్వరీ సహిత బ్రహ్మేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ సమయంలో సుమారుగా గంటన్నరసేపు భక్తులు రద్దీగా ఉన్న క్యూలైన్లలో ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా అప్పుడే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ.శ్యాంబాబు స్వామివారిని దర్శించుకుందామని వెళ్లారు. ఎమ్మెల్యే పూజలో ఉన్నారని ఆయనను సుమారు గంటన్నరసేపు నిలిపి ఉంచారు. దర్శనానికి వచ్చిన భక్తులు, టీడీపీ కార్యకర్తలు అసౌకర్యానికి, అసహనానికి గురై ఎమ్మెల్యే డౌన్...డౌన్ అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపటికి ఎమ్మెల్యే కుమారుడు ఎదురు రావడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వాగ్వివాదం చేసుకున్నారు. ఎవరికి సర్దిచెప్పాలో తెలియక పోలీసులు తల పట్టుకున్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోసిగి, మార్చి 8: కోసిగి మండల పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున కర్ణాటక రాష్ట్రం నుంచి కోసిగికి తరలిస్తున్న సుమారు రూ.60 వేల విలువ చేసే పది బాక్సుల అక్రమ కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అడిషనల్ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోసిగి మండల పరిధిలోని కందుకూరు గ్రామానికి చెందిన బోయ వీరారెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన అక్రమ కర్ణాటక మద్యం అని ఆ వ్యక్తి పరారు కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సీఐ మహబూబ్‌బాషా, సిబ్బంది నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్లు సిద్ధం కావాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ అధికారి నిమ్మగడ్డ



ప్రసంగిస్తున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

కర్నూలు(కల్చరల్), మార్చి 8: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్లు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ అధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో సిటి జన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కళాజాత ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ రాష్ట్ర ఎన్నికల ఆధి కారి, సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ మా ట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామానికి భంగం కలుగుతోందని అన్నా రు. దీన్ని పరిరక్షించుకునే బాధ్యత ఓటర్లపై ఉందని అన్నారు. ఓటర్లు ఇతరత్రా ప్రలోభాలకు లొంగకుండా ఓట్లు వేసి మంచి నాయకులను గెలి పించుకోవాలని, విజ్ఞతతో ఆలోచించాలని అన్నారు. మరో ముఖ్య అతిథిగా పూర్వ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. భవానీ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం మనకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉమ్మడి కలె క్టర్ రాంశంకర్ నాయక్, ఓర్వకల్లు మహిళా సమాఖ్య గౌరవ సలహాదారు బి. విజయభారతి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ప్రసంగించారు.

సెలవు రోజుల్లో పన్ను వసూలు కేంద్రాలు



పన్నుల వసూలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఓ, మేనేజర్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 8: నగరంలో ప్రజలు బకాయిలు ఏక మొత్తంగా చెల్లించేందుకు సెలవు రోజుల్లో కూడా కార్యాలయ ఆవరణలో పన్ను వసూలు కేంద్రాలు అందుబాటులో ఉంచినట్లు రెవెన్యూ ఆఫీసర్ జునైద్ తెలిపారు. శుక్రవారం మేనేజర్ చిన్నరాముడుతో కలిసి పన్ను వసూలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను 2023-24 రెండో ఆర్థిక సంవత్సరం వరకు పూర్తిగా చెల్లించని వారికి అపరాధ రుసుము మాఫీ చేస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి నట్లు ఆయన తెలిపారు. పన్నును నగర పాలక సంస్థ కార్యాలయము, వారు సచివాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చున్నారు. సీనియర్ సిటిజన్లు, మహిళల కు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

ఓర్వకల్లు, మార్చి 8: ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు లేక శనగ పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎంపీపీ క్రిష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ ఓర్వకల్లును కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం కేవలం పత్తి, కందులు, మొక్కజొన్నలకు మాత్రమే నష్ట పరిహారం చెల్లిం చారన్నారు. అయితే శనగ పంట గత ఏడాది 9 నుంచి 10 క్వింటాళ్లదిగుబడి మాత్రమే వచ్చిందని, ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఒకటి, రెండు క్వింటాళ్ల మాత్ర మే వచ్చిందన్నారు.

వాల్మీకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 8: వాల్మీకులకు రాజకీయ ప్రాదాన్యం కల్పించాలని వాల్మీకి బోయ సేవ సంస్థ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుభేరస్వామి, తలారి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేతంకృష్ణుడు కోరారు. శుక్రవారం వాల్మీకి బోయ సేవా సంస్థ కార్యాలయంలో కార్యకర్తల సమావే శంలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఆలూరు, ఆదోని మంత్రాల యం, అసెంబ్లీ స్థానాలు కర్నూలు పార్లమెంటు స్థానం, అనంతపురం జిల్లాలో హిందూపురం పార్లమెంటు స్థానం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు అసెంబ్లీ స్థానాలు వాల్మీకులకు కేటా యించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు, మార్చి 8: నగరంలో హైదరాబాదు జాతీయ రహదారిపై రావూరి గార్డెన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని షేక్ హుశేన్‌బాషా అనే వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు చెంచునగర్‌కు చెందిన హుశేన్‌బాషా రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయా లయ్యాయి. అటువైపు వెళ్తున్న చిన్నస్వామి చూసి స్థానికుల సాయంతో 108కి ఫోన్ చేయించి.. అంబు లెన్సులో హుశేన్‌బాషాను ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకెళ్లగా హుశేన్‌బాషా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరు కుని ప్రమాదం జరిగిన తీరును పరి శీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తు న్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సి.బెళగల్, మార్చి 8: మండలం లోని ముడుమాల, తిమ్మన దొడ్డి గ్రామాలలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బంది పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈసంద ర్భంగా ఎస్ఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా ఇసు కను తరలిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు.

కుంటలకు నీరు వదలండి

సి.బెళగల్, మార్చి 8: మండలం లోని క్రిష్ణదొడ్డి, బ్యాదోలి, బురాన్‌దొ డ్డిలోని కుంటలకు నీరు వదలాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. శుక్రవారం వారు మా ట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి నెల వస్తేనే ఆయా గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉందని తెలుసుకుని జిల్లా అధికారులు ఎల్లెల్సీ కాలువ ద్వారా తాగునీరు వదిలేవార న్నారు. అయితే ఈఏడాది వర్షాలు లేక పోవడంతో ఫిబ్రవరి నెలలోనే బోర్లలలోని నీరు పూర్తిగా ఇంకిపో వడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు గత నెల చివరి వారంతో స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేద న్నారు. కుంటలకు నీరు విడుదల చే యకుంటే మండల పరిషత్ కార్యా లయాల ముందు ధర్నా చేస్తామని ప్రజలు రాముడు, మల్లికార్జున, గోకారి, లింగన్న, వెంకటరెడ్డి హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి

» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కర్నూలు(కల్చరల్), మార్చి 8: మహా శివరాత్రి వేడుకలను శుక్ర వారం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నగరంలోని శైవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నగర సమీపంలోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంతోపాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో వెలసిన శైవ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే క్యూలైన్లలో నిల్చుని స్వామివారి, అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు.

● **జగన్నాథ గట్టుపై :** నగర శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన ఉమా సమేత రూపాల సంగమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. వేడుకల సందర్భంగా జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి, దేవదాయ శాఖ, దిన్నెదేవరపాడు గ్రామపంచా యతీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు టీడీపీ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పెరుగు పురుషోత్తమరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ వేళ స్వామివారికి నిర్వహిం చిన అభిషేకం చేశారు. ఆదివారం వేకువ జామున 3 గంటలకు శివపా ర్వతుల కల్యాణోత్సవం, స్వామివారి ప్రాకార పల్లకి సేవ చేపట్టారు. ఈ పూజలకు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, వైసీపీ కర్నూలు నియోజిక వర్గం సమన్వయకర్త ఇంతియాజ్ బాషా, వైసీపీ నాయకులు హాజరయ్యారు.

● **హరిహర క్షేత్రంలో :** నగరంలోని సంకల్‌బాగ్‌లో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రాతఃకాలం నుంచి రుద్రాభిషేకాలు, అర్ధరాత్రి రాత్రి లింగోద్భవ కాలంలో భక్తులచే అభిషేకాలు ఏర్పాటు చేశారు.

● నగర శివారు గుత్తిరోడ్డులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శ్రీగౌరీ శంకర స్వామికి అర్చనలు నిర్వహించారు. రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.



కాల్వబుగ్గలో స్వామి, అమ్మవార్లను పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు

● నగరంలోని బళ్లారి చౌరస్తారోడ్డులోని వాసవీనగర్‌లోగల శివాల యంలో శివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఉమా సహిత మహేశ్వర స్వామి వారికి ప్రత్యేక పంచామృ తాభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఊరేగింపుల నృత్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

● **నగరంలోని వివిధ ఆలయాల్లో..** సప్తగిరినగర్‌లోని కైలాసగిరి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజలు చేపట్టారు. తుంగభద్ర ఒడ్డునగల విద్యా శిఖామణి సమేత నగరేశ్వర ఆలయంలో, బి. క్యాంపులోని శంకర మందిరం లో, చిదంబరరావు వీధిలోని శంకర మఠంలో, అశోక్‌నగర్‌లోని ఆంజనే యస్వామి, ద్వారకామాయి సాయిబాబా దేవస్థానంలోని శివాల యంలో, కృష్ణానగర్ రోడ్డులోని మల్లికార్జున స్వామి దేవాలయంలో, అశోక్‌నగర్ కేసీ కెనాల్ సమీపంలోని శివరామాలయంలో, పాతనగరంలోని రంగరాజ వీధిలోని శివాలయంలో, జడ్పీలోని శివాలయంలో, కిసాన్ ఘాట్‌లోని సంగ మేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా బిల్వార్చనలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన కాల్వబుగ్గ

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వ రస్వామి ఆలయం శివనామస్మరణతో శుక్రవారం మార్మోగింది. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అంతకుముందు కాల్వ గ్రామం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలు, నందికోల సేవతో కాల్వబుగ్గ క్షేత్రానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కాటసాని కుటుంబ సభ్యులు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, రూరల్ సీఐ కిరన్ కుమార్ రెడ్డి, ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

● మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యా లవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, ఎన్. కొంతలపాడు, శకునాల, సోమ యాజులపల్లె తదితర గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా శివాలయాల్లో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గ్రామాల్లో మహాశి వరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో వేకువజాము నుంచే భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వర్కూరు సిద్ధేశ్వరస్వామి, ప్యాలకుర్తి భీమలింగేశ్వరస్వామి లద్దగిరి రామలింగేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో పంచామృతాభిషేకం, బిల్వ, పుష్పార్చన నిర్వహిం చారు. అర్ధరాత్రి లింగోద్భవ ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనం తరం స్వామి అమ్మవార్లకు కల్యాణం జరిపించారు.

సి.బెళగల్: మండలంలో కొత్తకోట, ఈర్లదిన్నె, శింగవరం, ముడు మాల, కొండాపురం, గుండ్రేవుల తదితర గ్రామాలలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు శివాలయలలో ప్రత్యేక పూజలు చేశారు, కార్యక్రమంలో సీబీ తులసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.



జగన్నాథ గట్టుపై పూజలు చేస్తున్న భక్తులు



వాసవీ నగర్‌లో చెక్క భజన



సూర్యనారాయణ స్వామి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు



కాల్వబుగ్గలో దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

దేశాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో నారా భువనేశ్వరి

కర్నూలు(కల్చరల్), మార్చి 8: దేశాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని కర్నూలు ఎయిర్‌పోర్టులో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను నారా భువనేశ్వరి కట్‌చేసి మహిళా దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మహిళలకు పెద్దపీట వేసిన పార్టీ తెలుగుదేశం పార్టీయే అని అని అన్నారు. అనంతరం ఆమె విమానంలో హైదరాబాదు బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, ప్రధాన కార్యదర్శి ఇ.సుకన్య దేవి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, రాజేశ్వరి, టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, కాకరవాడ చిన్నవెంకటస్వామి, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

వైద్య రంగంలో నర్సుల పాత్ర కీలకం

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు క్షేత్రస్థాయిలో వైద్యసేవలందించడంలో నర్సులు కీలక పాత్ర వహిస్తున్నారని కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకట తులసమ్మ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.ప్ర భాకర్ రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షురాలు ఎస్‌వీ విజయ మనోహరి, ప్లాస్టిక్ సర్జరీ విభాగపు హెచ్‌వోడీ డా. మంజులాబాయి పాల్గొ న్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ నర్సింగ్ సూపరిం టెండెంట్లు గ్రేడ్-2 సావిత్రీబాయి, నాగమణి, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-2లు అనుసూయ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

● జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినో త్సవం వేడుకలు ఏవో అరుణ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సంద ర్భంగా కార్యాలయ ఏవో అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో స్త్రీలు రాణిస్తున్నప్పటికీ ఇంకా మహిళలపై వివక్షత కొనసాగుతుందన్నారు. ఎన్‌ హెచ్ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఉమ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని కోరారు. అనంతరం ఏవో ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెమో అధికారి ప్రమీలమ్మ, డీఎంహెచ్‌వో ఆఫీసు, ప్రాంతీయ శిక్షణా కేంద్రం డెమో సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): సీపీఐ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి మహిళల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి రేణుక, సుధాదేవి, అమినాబి, పావని, జయమ్మ, వరద పాల్గొన్నారు.

● అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నగరంలోని వివిధ స్వచ్ఛంద, సేవా సంస్థల నిర్వాహకులు శుక్రవారం ఘనం గా నిర్వహించారు. వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి ఇంతియాజ్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకలు కేక్ కట్ చేశారు.

కోడుమూరు: స్థానిక పంచాయతీ కార్యాలయం, పోలీసు స్టేషన్‌లో అంత ర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పంచా యతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న కేక్‌ను కట్ చేసి మాట్లాడారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, ఉద్యోగాల్లో రాణించాలన్నారు. అలాగే స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో మహిళ పోలీసులను సన్మానించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించా లన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలనరసింహులు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూని యర్ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగాయి. కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థినులకు మలబార్ గోల్డు సంస్థ ద్వారా రూ.1,44,000లు నగదు స్కాల ర్‌షిప్ ప్రోత్సాహకంగా మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలోని మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అద్యాపకులు జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మి, గిరిజారాణి, శ్రావణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్ రెడ్డి



కోడుమూరులో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ భాగ్యరత్న



బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో..

లేపాక్షి ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్స్ ప్రారంభం



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళలు

కర్నూలు(కల్చరల్), మార్చి 8: నగరంలోని పెద్ద పోస్టాఫీసు ఎదురుగా గల లేపాక్షి ఎంపోరియంలో క్లియరెన్స్ సేల్స్‌ను మేనేజర్ బి.తిమ్మయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా తిమ్మయ్య మాట్లాడుతూ ఈ క్లియరెన్స్ సేల్స్ ఈనెల 31 వరకు ఉంటుందని తెలిపారు. లేపాక్షి ఎంపోరియంలోని ఎంపిక చేసిన వివిధ హస్తకళా ఉత్పత్తులు, చేనేత వస్త్రాలపై 40 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఉం టుందని ఆయన తెలిపారు. లేపాక్షి ఎంపోరియంలో కొండపల్లి బొమ్మ లు, బంజారా, ఏటి కొప్పాక, వైట్ మెటల్ బొమ్మలు, లెదర్, బ్రాస్, బ్లాక్‌మెటల్ వస్తువులు, వుడ్ కార్వింగ్, రుద్రాక్షలు లభిస్తాయని తెలిపారు. అలాగే నారాయణపేట్, మంగళగిరి, గద్వాల, పోచంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన చేనేత చీరె లు, డ్రెస్ మెటీరియల్స్ లభిస్తాయన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

కర్నూలు(అర్బన్), మార్చి 8: బీసీ డిక్లరేషన్ ప్రకటించడంపై తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకవీటి విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీసీల కు జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయం, మోసాన్ని ఎండ గడతామన్నారు.

'మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి'

కర్నూలు(కల్చరల్), మార్చి 8: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పురుషులతో సమానంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సం దర్భంగా నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో మహిళలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు చిట్టెమ్మ, రాము లమ్మ, నాగమ్మ, స్వాతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.


నీలకంఠేశ్వరుడి ప్రభోత్సవం

గూడూరు, మార్చి 7: గూడూరులో భువనేశ్వరీ నీలకంఠేశ్వరుడి ప్రభోత్సవం శుక్రవారం ఆశేష భక్తజనుల మధ్య వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవా ర్లకు ఆలయ పూజారి నాగరాజు అభిషేకం తదితర పూజలు చేశారు. సాయం త్రం నీలకంఠేశ్వరుని ప్రభోత్సవం జరిగింది. అలాగే స్వామివారి కల్యాణం నిర్వహించగా భక్తులు పాల్గొని తిలకిం చారు. కార్యక్రమంలో స్వామివారి భక్త బృందం పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలి

కర్నూలు(హాస్పిటల్), మార్చి 8: వేసవిలో వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాల సీనియర్ వైద్యాధికారి డా.ద్వారం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని అశోక్‌నగర్ శివాలయం వద్ద ఆయుష్ కమిషనర్ ఆదేశాల మేరకు శివభక్తులకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 300 మందికి చికిత్స అందించి మందులను పంపిణీ చేశారు.

కోడుమూరులో డెంగీ కేసు నమోదు



కొండపేటలో పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు, మార్చి 8: స్థానిక ఐదో సచివాలయం పరిధిలోని కొండపేటలో 45 సంవత్సరాల వ్యక్తికి డెంగీ వ్యాప్తి చెందిందని వైద్య సిబ్బంది శుక్రవారం తెలిపారు. గత కొంత కాలంగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాధితుడికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా డెంగీ జర్వం అని నిర్ధారణ అయిందని మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి, ఎంపీహె ఈవో నరసప్ప చెప్పారు. బాధితుడి ఇంటిని పరిశీలించి పంచాయతీ బోర్డు సహకారంతో ఆ ప్రాం తంలో అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా రంగ స్వామి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూప ర్‌వైజర్లు ఉమాబాయి, కమాల్‌సాహెబ్, శిరీష ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 8: స్థానిక ఆదర్శ విద్యామందిరంలో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న 52వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియ న్‌షిప్ లోగోను గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ బి.శంకర్‌శర్మ ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని గురుదత్త క్లీనిక్‌లో లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌శర్మ మాట్లాడుతూ హ్యాండ్ బాల్‌ ను క్రీడాకారులు ఎంచుకోవడం సంతోషమన్నారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు టి.గంగాధర్, కొండెపోగు చిన్న సుం కన్న, నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, మార్చి 8: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని పార్టీ నాయకుడు కురువ గిడ్డయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇం టింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మంగళగిరి బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేసిన బీసీలకు ఇచ్చిన పది పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈవో, డీఈవోల దిష్టిబొమ్మలు దహనం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 8: మండలంలోని గార్లదిన్నె గ్రామం ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని ఆర్‌యుఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, గ్రామస్థుడు తిమ్మగురుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పాఠశాల ముందు ఎంఈవో, డీఈవో ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో 90 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వెంటనే పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దేవాలయ అభివృద్ధికి సహకరించాలి

మద్దికెర, మార్చి 8: మండలంలోని పెరవలి రంగనాథ స్వామికి గ్రామానికి చెందిన రాజేంద్ర, గాయత్రీ దంపతుల కుమారుడు పృథ్విరాజు రూ.50వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడు, ప్రధాన అర్చకులు రంగస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు.

వైఎస్ షర్మిలతో భేటీ

ఆదోని టౌన్, మార్చి 8: ఆదోని అసెంబ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న బోయ నీలకంఠ పీసీసీ ప్రధాన కార్యాలయం పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలతో విజయవాడలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు మరొకసారి అవకాశం కల్పించాలని అధ్యక్షురాలిని కోరినట్లు ఆయన తెలిపారు. తనతో చర్చలు జరిపిన అనంతరం త్వరలో నియోజకవర్గాల వారిగా అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని అధ్యక్షురాలు తెలిపారని అన్నారు.

ఆధ్యాత్మిక సభలలో రాజకీయాలు తగదు

ఆదోని టౌన్, మార్చి 8: మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో కొందరు నాయకులు రాజకీయ ప్రసంగాలు చేయడం సముచితం కాదని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నూర్ అహమ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీస్ మెసేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, మత బోధకుడైన బ్రదర్ సిరాజ్ చేసే ఆధ్యాత్మిక సభలలో వైసీపీ నాయకులు ఈ మధ్యకాలంలో స్టేజి ఎక్కి ఎన్నికల ప్రచారం చేయడంపై ఇటీవల తాము ప్రశ్నించడంతో ఆదోనిలో జరిగిన వారి సభలో రాజకీయ జోక్యానికి అడ్డుకట్ట పడిందని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు రాజకీయ వేదికలుగా కాకుండా తెలుగుదేశం పార్టీతో పాటు జనసేనకు సంబంధించిన నాయకులు అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు ప్రారంభం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 8: దేవిబెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర, హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఎమ్మిగనూరు వైసీపీ సమన్వయ కర్త బుట్టారేణుకలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజలు, రైతులకు వైసీపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

చెన్నాపురంలో ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 8: మండలంలోని చెన్నాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆశీర్వాద ఆంజనేయ స్వామి దేవాలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ధ్వజస్తంభన ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసీపీ ఎమ్మిగనూరు సమన్వయ కర్త బుట్టారేణుకా పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన మాచాని సోమనాథ్

ఎమ్మిగనూరు, మార్చి 8: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా పత్తికొండ పర్యటనకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారాభువనేశ్వరిని శుక్రవారం ఎమ్మిగనూరుకు చెందిన టీడీపీ నాయకులు మాచాని సోమనాథ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.


నారా భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాచాని సోమనాథ్

టీడీపీ కార్యాలయం ప్రారంభం

వెల్దుర్తి, మార్చి 8: వెల్దుర్తి పట్టణంలో కొత్తబస్టాండ్ సమీపంలో నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ. శ్యాంబాబు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి కాకుండా అరాచక పాలనను అందించిందన్నారు. బీసీల సంక్షేమమే ధ్యేయంగా కేఈ కుటుంబం ముందుకు సాగుతోందని, వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకు కలిసికట్టుగా ముందుకు సాగుదామని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, జయరాముడు, నాగేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ ఆచారి, సుధాకర్‌గౌడ్, క్రిష్ణగిరి నాయకులు నబీసాహెబ్, శ్రీరాములు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేఈ శ్యాంబాబు

ఘనంగా మహాశివరాత్రి

జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల్లో పరమశివుడిని కొలుసూ రుద్రాభిషేకాలు చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో వేకువజామున నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు.


పట్టణంలోని కోటా వీధిలో వెలసిన ఈశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్న స్వామివారు


పూలచింతలో బండేగురు పల్లకోత్సవం


పత్తికొండలో జాగరణ కోసం మండిగిరి కొండపైకి వచ్చిన భక్తులు


ఆదోని పట్టణంలోని వసంత టాకీస్ పక్కన ఉన్న శివాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు


తుగ్గలి మండలం బోడిబండలో పూజలందుకుంటున్న ఫక్కీరప్ప స్వామి


మహ శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


నదీతీరంలో రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని అలంకరించిన దృశ్యం


ఆస్పరిలో పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు


మంత్రాలయం శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


గురుజాలలో ఇసుకలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి


ఆదోని: ఊరేగింపులో పాల్గొన్న బ్రహ్మకుమారిలు


తేరుబజారులో ఓం ఆకారంలో దీపాలను వెలిగించిన దృశ్యం


గోనెగండ్లలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న నీలకంఠేశ్వరుడు, కాశీ విశ్వేశ్వరుడు


ఆదోని శాంతమల్లప్ప కొండలో దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


ఆదోని శాంతమల్లప్ప కొండలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శివలింగం


మద్దికెరలో ఉత్సవమూర్తులను తీసుకొని వస్తున్న దృశ్యం

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

● ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 8: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడు, జనసేనా అధినేత పవన్‌కళ్యాణ్ బీసీలకు వెన్నుదండుగా నిలవడంతో పాటు ఆర్థికాభివృద్ధిని, రక్షణ పొందేందుకు బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించడంతో శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఎన్టీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే బీవీ, టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ ప్రకటించి రాష్ట్రంలోని బీసీలకు చంద్రబాబు ఎంతో భరోసా కల్పించారన్నారు. ప్రధానంగా 50 ఏళ్లకే బీసీలకు రూ.4వేల పెన్షన్, చంద్రన్న బీమా రూ.10లక్షలు, పెళ్లికానుక కింద రూ.లక్ష, గురుకుల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించే విధంగా బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించడం జరిగిందన్నారు. బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని బీసీలందరికీ భరోసా కల్పించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అంతకుముందు పట్టణంలోని 14, 16వ వార్డుల్లో బాబుషూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. క్యార్యక్రమంలో కౌన్సిలర్లు రాందాసుగౌడు, దయాసాగర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండయ్య చౌదరి, ముల్లా ఖలీముల్లా, మల్లి, తురేగల్ నజీర్, నాయకులు జహంగీర్, కటారి రాజేంద్ర, రంగస్వామిగౌడు, సుందర్ రాజు, రామకృష్ణగౌడు, పార్లపల్లి మల్లికార్జున పాల్గొన్నారు. ఉరుకుంద, జయన్న, కామార్తి మహేష్, చేనేత మల్లి, అంజి పాల్గొన్నారు.

తుగ్గలి, మార్చి 8: తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందుతారని మాజీ సర్పంచ్ బర్మ వీరేష్ అన్నారు. శుక్రవారం పెండేకల్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీపై ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.


మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

మద్దికెర, మార్చి 8: ఒక్క చాన్స్ అంటూ ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజనేయులు, మైనార్టీ నాయకులు సాయిన గర్‌బాషా అన్నారు. శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, మాస్టర్ గిడ్డయ్య తదితరులు ఉన్నారు.


మద్దికెరలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

'కలలకు రెక్కలు' పథకంతో మహిళా సాధికారత

● ఆలూరు టీడీపీ ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ



ఆలూరు, మార్చి 8: మహిళా సాధికారత దిశగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'కలలకు రెక్కలు' పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు చదువుకు ఆర్థిక ఇబ్బంది పడి ఇంటికి పరిమితం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకవస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింతగా ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, రాష్ట్రంలోని ఏ ఆడబిడ్డ కూడా ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ కలలకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ పథకం గురించి హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీని రిజిస్ట్రేషన్ లింక్ పొందడానికి 9261292612కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు.

ఎమ్మిగనూరు: రాష్ట్రంలో టీడీపీ, జనసేనా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల చదువు కోసం కలలకు రెక్కలు.. అనే పథకాన్ని ప్రవేశపెడతామని తెలుగు మహిళా అధ్యక్షురాలు దేవమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలలకు రెక్కలు పథకం కింద విద్యార్థినిలు చదువు కోసం బ్యాంకుల్లో తీసుకునే రుణానికి టీడీపీ, జనసేనా ఉమ్మడి ప్రభుత్వం బాధ్యత వహించి వడ్డీకూడా చెల్లిస్తుందన్నారు. ఈ సమావేశంలో తెలుగు మహిళా నాయకులు పద్మ, బడేబి, సరోజమ్మ, శంకరమ్మ, అమీనమ్మ, వరలక్ష్మి, నాగవేణి, రేష్మా, ఉమాదేవి, ఖాజాబి, అచ్చమ్మ, సత్యమ్మ, పద్మమ్మలు పాల్గొన్నారు.

మహిళలు ఎదిగితేనే దేశాభివృద్ధి

జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జొన్నగిరిలో మిఠాయిలు తినిపించుకుంటున్న మహిళలు

తుగ్గలి, మార్చి 8: మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని మహిళా కమిటీ సభ్యులు భగవతి, రాజెమ్మ, నాగేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జొన్నగిరిలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మాయిలను బాగా చదివిస్తే.. ఆ కుటుంబం అభివృద్ధి పథంలో ఉంటుందని అన్నారు. తద్వారా రాష్ట్రాలు, దేశాలు బాగుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు రామాంజనేయులు, రంగన్న, తులసి, ఏసమ్మ ఉన్నారు.

ఆదోని (అగ్రికల్చర్): ఆదోని పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమంలో అనాథ మహిళలను, వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మహిళలను సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

● పట్టణంలోని ఎస్టీయూ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సభ ఏర్పాటు చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప, నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ మహిళలను గౌరవించడం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా వారికి అందరు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్ బాబు, రవి, భీమరాజు, రామాంజనేయులు, సత్యన్న, ఈరన్న, రాజా పాల్గొన్నారు


ఆలూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడకలు శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులకు, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులమ్మ మహాదేవమ్మ, సుధారాణి, ప్రహ్లాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు జయ్యమ్మ, రామలింగమ్మ, శ్రీకృష్ణదేవరాయ స్కూల్ కరస్పాండెంట్ ప్రగతి, ప్రగతి స్కూల్ నిర్వాహకురాలు పద్మావతి, ఎస్టీయూ నాయకులు రామకృష్ణ రెడ్డి, సూర్య నారాయణ, నాగరాజు, రిటైర్డ్ టీచర్ గోవిందప్ప, కవి ఈశ్వరప్ప పాల్గొన్నారు.


ఆదోనిలో జీవనజ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులను సన్మానిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మద్దికెర: మండలంలోని మద్దికెర, ఎం. అగ్రహారం గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వేడుకల్లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, ఏఏఆర్‌డీఐపీఐ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మహిళలతో ఆటలపోటీలను నిర్వహించారు. ఈ ఆట పోటీల్లో గెలుపొందిన మహిళలకు సర్పంచ్ బురుజుల విజయుడు, ఎంపీటీసీ వేణమ్మ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని తెలిపారు.

ఎమ్మిగనూరు: శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వెంకటాపురం కాలనీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని శ్రామిక మహిళా సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం నాయకులు ఏసేపు, మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లమ్మ, లింగమ్మ మాట్లాడుతూ మహిళలు నేటికి సమసమాజ స్థాపన కోసం మొక్కవోని ధైర్యసాహసాలతో పోరాడుతున్నారన్నారు.


ఆలూరులో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు


మద్దికెరలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు

నారా భువనేశ్వరికి కృష్ణమ్మ శుభాకాంక్షలు


నారా భువనేశ్వరిని కలసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ

ఆదోని: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నారా భువనేశ్వరికి టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా తన స్వగృహంలో మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు తమ్ముళ్లతో కలిసి కేక్‌ని కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం కర్నూల్లో పర్యటిస్తున్న నారా భువనేశ్వరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గుడిసె కృష్ణమ్మ విలేకరులతో మాట్లాడుతూ మహిళలను తోబుట్టువుల్లా చూసే ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. విద్యా, ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఆడబిడ్డల జీవితాల్లో టీడీపీ వెలుగులు నింపిందని స్పష్టం చేశారు.


వృద్ధుడికి భరోసానిస్తూ మాట్లాడుతున్న టీజీ భరత్

టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకలు పురస్కరించుకొని మే 28న గోదారి తీరంలో.. రాబోయే కురుక్షేత్రానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు సమర శంఖం పూరించారు. సంక్షేమ, నవ్యాంధ్ర ప్రగతి శరాలు సంధించి రణభేరి మోగించారు. పేదలను ధనికులుగా మార్చడమే లక్ష్యం అన్నారు. మహిళలు, యువత, రైతులు కోసం మహాశక్తి, యువగళం, అన్నదాత పేర్లతో ప్రత్యేకమైన హామీలు కురిపించారు. ఈ హామీలతో తెలుగు తమ్ముళ్లలో సమరోత్సాహం నింపారు. అదే స్ఫూర్తితో తుంగభద్ర తీరంలో రానున్న మహా సంగ్రామానికి కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ సూపర్ సిక్స్ పేరిట సమర శంఖం పూరించారు. రాజకీయ వర్గాలు, నగరవాసుల్లో సరికొత్త చర్చకు వేదిక అయ్యారు. కర్నూలు నగరం స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడం.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పరిచేందుకు పరిశ్రమల ఏర్పాటు.. తెలుగుదేశానికి దన్నుగా నిలిచిన అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా.. కర్నూలు సర్వజన వైద్యశాలను మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ఆధునికీకరించడం.. తన లక్ష్యమని టీజీ భరత్ ప్రకటించారు. మరో రెండు నెలల్లో చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరనున్న టీడీపీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి చేరవేయడమే లక్ష్యమని ఆయన అన్నారు. కర్నూలు కేంద్రంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు బాధ్యతను స్వీకరిస్తూ రెండు రోజుల క్రితం నగరం నుంచి తరలి వచ్చిన వేలాది మంది టీడీపీ శ్రేణులు, టీజీ అభిమానుల హర్షధ్వానాల మధ్య టీజీ భరత్ సూపర్ సిక్స్ విడుదల చేశారు. మీ బిడ్డగా ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ విలువైన ఓటు సైకిల్ గుర్తుకే వేసి నన్ను అసెంబ్లీకి పంపండి.. మీ కళ్లముందే గొప్పగా ఎదిగే కర్నూలు స్మార్ట్ సిటీని మీకు బహుమతిగా ఇస్తా..! అంటూ టీజీ భరత్ సమరానికి సై అన్నారు. నగరంలో ఇప్పుడే ఏ వీధికి వెళ్లినా.. ఏ ఇద్దరు కలసినా.. ఏ టీకొట్టు దగ్గర చూసినా ఈ ఆరు గ్యారెంటీలు గురించే చర్చ జరుగుతోంది. ఆ వివరాలు పరిశీలిస్తే..



స్మార్ట్ సిటీ నా లక్ష్యం



- పారిశ్రామిక విజన్‌తో కర్నూలు అభివృద్ధి
- హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం కార్యాచరణ
- 'సూపర్ సిక్స్' స్ఫూర్తితో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ సమర శంఖం
- రాజకీయ ప్రకంపనాలు సృష్టిస్తున్న నగర విజనరీ

టీజీ భరత్ బాధ్యతగా స్వీకరించిన ఆరు గ్యారెంటీలు

1 స్మార్ట్ సిటీగా కర్నూలు నగరం



నగర ప్రజలకు శుద్ధి చేసిన స్వచ్ఛమైన తాగునీరు ఇంటింటికి అందించడం.. అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ తీగలు, స్తంభాలను క్రమబద్ధీకరించి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా ప్రజల సంరక్షణ.. క్రమపద్ధతి ప్రకారం మురుగు కాల్వలు శుభ్రం, చెత్త సేకరణ వంటి పారిశుధ్య పనులు మెరుగు పరిచి స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దడం.. తుంగభద్ర పరివాహక ప్రాంతాన్ని కలుపుతూ నెక్లెస్ రోడ్డు నిర్మాణం.. నగరం చుట్టూ ఉన్న పర్యాటక కేంద్రాలను పునరుద్ధరించి టూరిస్టు హబ్‌గా ఏర్పాటు.. ట్రాఫిక్ సమస్యలకు స్వస్తి చెప్పే దిశగా ఫ్లై ఓవర్ బిడ్జీలు, కొత్తగా సర్కిళ్ల ఏర్పాటుకు కృషి.. క్రీడల్లో యువతకు ప్రోత్సాహం, క్రీడా మైదానాల ఆధునికీకరణపై దృష్టి పెట్టడం..

2 నూతన పరిశ్రమలు..



నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించే లక్ష్యంగా కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి ప్రస్తుత ఇండస్ట్రియల్ పార్క్ కేంద్రంగా పారిశ్రామిక ప్రగతి పట్టాలెక్కించడం ప్రధాన లక్ష్యం..స్కిల్‌డెవలప్‌మెంట్ స్థాపించి యువతకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ)పై శిక్షణ.. ప్రముఖ కంపెనీలు కర్నూలుకు రప్పించి ప్రతి 3 నుంచి 6 నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళా ఏర్పాటు.. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనుకునే యువతకు ప్రోత్సాహం..

3 మహిళల భద్రత.. ఆర్థిక భరోసా..



నగరంలో పరిధిలోని మహిళలందరి ఆదాయం పెంచేలా ప్రత్యేక ప్రణాళిక.. చదుకోవాలనే ఆసక్తి కలిగిన అమ్మాయిలందరూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేలా ప్రణాళిక రూపకల్పన.. మహిళలకు చేయుతగా శిక్షణా తరగతులు, సొంతకాళ్లపై నిలబడేలా స్వయం ఉపాధి కోసం రుణ సౌకర్యం కల్పించేందుకు కృషి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి మహిళకు అందించేలా చర్యలు.. తోబుట్టువులాంటి కర్నూలు ఆడపడుచులకు ఏ ఆపద వచ్చినా పరిష్కరించడం..

4 ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ప్రజలు సంపూర్ణమైన ఆరోగ్యం కలిగి ఉన్నప్పుడే మన కర్నూలు ప్రగతి పథంలో పరుగులు పెడుతుంది. అందుకే కర్నూలు సర్వజన వైద్యశాలను 'మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి'గా వంద శాతం ఆధునీకరించేలా ప్రత్యేక చర్యలు.. ప్రస్తుతం ఉన్న యునానీ ఆసుపత్రిని ఆధునీకరించి మెరుగైన సేవలు అందేలా కృషి. గర్భిణీ, ప్రసూతి పిల్లల విభాగాలలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం.. దోమలపై సమరం సాగించి మలేరియా, డెంగీలాంటి ప్రాణాంతకమైన జబ్బులకు స్వస్తి పలకడం.. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ.. ప్రతి ఒక్కరికి అందుబాటులో అత్యాధునిక వైద్య సౌకర్యం అందేలా కృషి చేయడం..


ఆరు పథకాలను వివరిస్తూ..



కర్నూలు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఒకనాటి ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా కర్నూలుకు ఘన చరిత్ర ఉంది. 1952లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఇక్కడి నుంచి తొలి ఎమ్మెల్యేగా దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019 వరకు 15 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. కందనవోలు ప్రముఖ పారిశ్రామికవేత్త, దాన కర్ణుడుగా పేరుగాంచిన సేవాతత్పరుడు టీజీ వెంకటేశ్ 1999లో తెలుగుదేశం పార్టీ టికెట్‌పై పోటీ చేసి విజయం సాధించి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం బీజం వేశారు. 1999లో రెండో పర్యాయం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. టీజీ వెంకటేశ్ రాజకీయ వారసుడిగా ఆయన తనయుడు, యువ పారిశ్రామివేత్త టీజీ భరత్ 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగు పెట్టారు. చివరి క్షణంలో టీడీపీ టికెట్ ఇవ్వడం.. సమయం తక్కువ ఉండడం వల్ల రాష్ట్రంలోనే అతిస్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయినా.. కుంగిపోకుండా రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సేవకే అంకితమై నిత్యం జనం మధ్యనే ఉంటూ ప్రజలు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ వచ్చారు. రానున్న ఎన్నికల్లో కర్నూలు టీడీపీ అభ్యర్థిగా టీజీ భరత్‌ను ఆ పార్టీ అధినేత చంద్రబాబు తొలి జాబితాలోనే ప్రకటించారు. అదే జోష్‌తో ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. నవ్యాంధ్ర ప్రగతి, సంక్షేమం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ స్ఫూర్తితో.. కర్నూలు నగర ప్రగతి, యువత ఉద్యోగ ఉపాధి, మహిళల ఆర్థిక భరోసా కల్పించే దిశగా ఆరు గ్యారెంటీలతో ముందుకు సాగుతున్నారు. పార్టీ అజెండాతో పాటు సొంత అజెండాను ప్రజల ముందు ఉంచి నన్ను ఆశీర్వదించి ఒక్క అవకాశం ఇవ్వమని ప్రజల ముందుకు వెళ్తున్నారు.

కుల మతాలకు అతీతంగా సేవ చేస్తా

- సాయిబాబా నగర్‌లో చర్చి ప్రారంభించిన టీజీ భరత్


చర్చిని ప్రారంభించిన టీజీ భరత్

కర్నూలు అర్బన్: కుల, మతాలకు అతీతంగా సేవ చేస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం సాయిబాబా నగర్ లో రూ. 7లక్షలతో నిర్మించిన చర్చిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి టీజీవీ గ్రూప్స్ తరపున సాయం చేస్తామన్నారు. పెద్దలందరితో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు. చర్చి నిర్మాణంలో టీజీవీ సంస్థ తరపున భాగస్వామ్యం అవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని, మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం సేవకులు ఆనందరావు, క్రీస్తు సంఘం సేవకులు ప్రసాదరావు, ఇబ్రహిం, పట్నం క్రీస్తు సంఘం సేవకులు విజయ రావు, రాజ్‌కుమార్, సురేంద్ర, నాగరాజు, సుందర్శనం, పాస్టర్ రాజు, కే.రాజ్‌కుమార్, వీరశైవ సాధికార కమిటీ నాయకుడు శివరాజ్ పాల్గొన్నారు.

టీడీపీ వైపే ముస్లింలు

భరోసా యాత్రలో టీజీ భరత్


భరోసా యాత్రలో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు అర్బన్: తెలుగుదేశం పార్టీ వైపే ముస్లింలు ఉన్నారని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ గఫార్, చిన్న రంగరాజు వీధుల్లో ఆయన భరోసా యాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు, ఆరు గ్యారెంటీల మేనిఫెస్టోను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాల న్నారు. ముస్లిం మహిళలు, పెద్దలు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలున్నాయని, డ్రైనేజీలు కంపు కొడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని వాపో యారు. స్పందించిన టీజీ భరత్ మాట్లాడుతూ తాను రూపొందించిన 6 గ్యారెంటీల మేనిఫెస్టో అమలైతే ప్రజలన్నీ సమస్యలు తీరి పోతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషగిరి శెట్టి, జియా, టీజీ శ్రీనివాసులు, కార్పొరేటర్ పరమేష్, సల్మాన్, మన్సూర్, శ్రీధర్, సతీష్, మురళి, నారాయణ, రాజేశ్వరి, రహ్మతుల్లా, యూసుఫ్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

5 ఇంటింటా సంక్షేమం లక్ష్యం



రానున్న చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు కుల, మతాలకు అతీతంగా ప్రతి ఇంటికి.. ప్రతి ఒక్కరికి అందించడం.. టీడీపీ ప్రభుత్వం ఆయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు అర్హులకు పంపిణీ, అసంపూర్తి టిడ్కో ఇళ్లు పూర్తి చేయడం.. అర్హులైన పేదలు అందరికి ఇంటి స్థలం పట్టా, పక్కా ఇలు నిర్మాణం.. కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయించడం..



● తొలిసారిగా టీజీ భరత్‌ను చూస్తున్నాను



నేను ఐదారు ఎన్నికల్లో ఓటు వేశాను. ప్రతి ఒక్కరూ నాకు ఓటు వేయండి అని అడిగిన నాయకుడినే చూశాను. నాకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ఇదిగో ఈ ఆరు గ్యారెంటీలు పైన ప్రత్యేక దృష్టి పెడుతాను.. ప్రజల సంక్షేమ.. నగర ప్రగతికే అంకితం అవుతాను అంటూ ఆరు గ్యారెంటీలతో ముందుకు వచ్చిన నాయకుడు టీజీ భరత్‌నే తొలిసారిగా చూస్తున్నాను. రాష్ట్రంలో చంద్రబాబు.. నియోజకవర్గంలో టీజీ భరత్ మహిళల ఆర్థిక ప్రగతికి ప్రత్యేక దృష్టి సారించినట్లు స్పష్టం అవుతోంది. ఇలాంటి నాయకుడే మనకు కావాలి.

- టేకూరి శారదమ్మ, ప్రకాశ్ నగర్, కర్నూలు

● పేదలకు అండగా ఆరు గ్యారెంటీలు



ప్రజల అభ్యున్నతి.. కర్నూలు నగర ప్రగతిని కాంక్షిస్తూ ఆరు గ్యారెంటీలతో టీజీ భరత్ ప్రజల ముందుకు వస్తున్నారు. టిడ్కో ఇళ్ల పంపిణీ, అర్హులకు ఇంటి స్థలం పట్టాల పక్కా ఇల్లు నిర్మాణానికి ప్రత్యేక ప్రధాన్యత ఇస్తాను అంటున్నారు. కల్లబొల్లి మాటలతో కా కుండా.. నన్ను గెలిపించండి.. రాబో యే ఐదేళ్లలో ఫలానా చేస్తా అనే స్పష్టమైన హామీతో టీజీ భరత్ ముందుకు వస్తున్నారు. అధికారం ఉన్నా లేకున్నా సేవా కార్యక్రమాల ద్వారా నిత్యం ప్రజలకు అందుబాటులో టీజీ కుటుంబం ఉంది. ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపింతే రెట్టింపు ఉత్సాహంతో పేదలకు అండగా పని చేస్తారని నేను పూర్తిగా నమ్ముతున్నాను.

- శేషమ్మ, లేబర్ కాలనీ, కర్నూలు

● నగర అభివృద్ధి అజెండాతో వచ్చారు



ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు వస్తుంటాయి. ఎందరో నాయకులు వచ్చారు. నాకే ఓటు వేస్తే నగరాన్ని అభివృద్ధి చేస్తాను.. మెరుగైన పారిశుధ్యం, తాగునీటి సరఫరా చేస్తాను.. పేదలకు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తాను..అనే స్పష్టమైనా అజెండాతో వచ్చిన నాయకుడు టీజీ భరత్‌నే చూస్తున్నాను. ఇలాంటి నాయకులను ప్రజలు కోరుకుంటారు. ఆరు గ్యారెంటీలు చాలా బాగున్నాయి.

- బి. చిన్నమ్మ, వడ్డెగేరి, కర్నూలు

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చారు



నవ్యాంధ్ర ప్రగతి, సంక్షేమ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ స్ఫూర్తితో.. కర్నూలు నగర అభివృద్ధి, సంక్షేమ కోసం టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఆరు గ్యారెంటీలు ఇవ్వడం నాకు నచ్చింది. ముఖ్యంగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా కర్నూలు కేంద్రంగా హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాను అని ఆరు గ్యారెంటీల్లో ఒకటిగా చేర్చడం విజన్ ఉన్న నాయకుడికే సాధ్యం. ఎలాంటి పదవి.. హోదా లేకుండగానే జాబ్ మేళా ద్వారా 400 మంది యువతకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించారు. అదే ఎమ్మెల్యేగా గెలిస్తే ఎంతో మంది యువతకు ఉద్యోగాలు కల్పించవచ్చు. టీజీ భరత్ విజన్ ఉన్న నాయకుడు.

- డి. విక్రమ్‌సింగ్, న్యాయవాది, ఎన్ఆర్ పేట, కర్నూలు

6 మన కర్నూలు.. మన హైకోర్టు బెంచ్



టీడీపీ కొలువు దీరగానే నగర ప్రజలు, న్యాయవాదుల చిరకాల స్వప్నమైన హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం.. తద్వారా చిరువ్యాపారులు, హోటల్ రంగం పురోగతి సాధించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం.. ఆర్థికంగా.. రవాణా రంగాల్లో నగరాన్ని ప్రగతి దిశగా నడిపించడం.. భవన నిర్మాణం రంగం.. రియల్ ఎస్టేట్ రంగం పురోగతి సాధించి కర్నూలుకు మహర్దశకు తీసుకొచ్చేందుకు కృషి చేయడం లక్ష్యంగా పని చేస్తా.. అని టీజీ భరత్ తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.